INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed:VOLUME:9, ISSUE:6(7), JUNE :2020

# తెలుగుసాహిత్యంలో "గురుదక్షిణ"

**డా॥ గుమ్మనూరు ఉషారాణి**
రీడర్ ఇన్ తెలుగు,
శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పుంగనూరు, చిత్తూరు జిల్లా.
సెల్: 9908275001.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥

భారతీయ సంస్కృతి "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ" అంటూ తల్లిదండ్రుల తర్వాత గురువుకే పెద్దపీట వేసింది. దీనికి కారణం తల్లిదండ్రులు కన్నప్రేమతో బిడ్డల జీవితాలను తీర్చిదిద్దడానికి ఆరాటపడతారు. వారు ప్రాణం పోస్తే, గురువు జీవితాన్ని అవపోసన పట్టిస్తాడు. నిస్వార్థంగా శిష్యులకు తాను నేర్చిన శాస్త్రజ్ఞానాన్నంతటిని పంచిపెట్టి "గురువును మించిన శిష్యుడు" అనిపించాలని తపన పడతాడు.

అజ్ఞానతిరాంధస్య జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమః ॥

మనలోని అజ్ఞానాంధకారాన్ని తొలగింపజేసి, జ్ఞానజ్యోతిని నింపే భాస్కరుడే గురువు. పూర్వం విద్యార్థులు జ్ఞానార్థులై గురుకులాలను ఆశ్రయించేవారు. తమ వద్దకు విద్య సముపార్జన కోసం వచ్చిన శిష్యులకు తమ బిడ్డలతో సమానంగా విద్యతో పాటు ఆప్యాయానురాగాలను, సభ్యతా సంస్కారాలను అందించి వారి భవిష్యత్తుకు మార్గనిర్దేశనం చేసేవాడు ఆనాటి గురువు.

**క॥ గురులకు శిష్యులు పుత్రులు**

**పరమార్థము లోకధర్మపథమిది ....** (శ్రీమదాంధ్ర మహాభారతము - ఆదిపర్వం - 3-131) అని నన్నయ గురువులకు శిష్యులు పుత్రులతో సమానమని కచుని ముఖతః తెలియజేశాడు. అటువంటి ఆ గురువులకు శిష్యులు శుశ్రూషలు చేస్తూ గురువుగారి అభిమానాన్ని చూరగొని విద్యను పూర్తి చేసుకొనేవారు. విద్యాభ్యాసం పూర్తయిన పిమ్మట, కృతజ్ఞతాపూర్వకంగా ఇచ్చుకొనే ప్రీతిపూర్వక కానుకే "గురుదక్షిణ".

**"ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతు మావ్యవచ్ఛేత్సీః"**

అంటూ గురువు కోరిన అర్థాన్ని / కోరికను గురుదక్షిణగా సమర్పించి / నెరవేర్చి వంశాభివృద్ధికి తోడ్పడమని ఉపనిషత్తుల్లో చెప్పబడింది.

ఈ సదస్సులో నేటి నా అంశం తెలుగు సాహిత్యంలో "గురుదక్షిణ". మన తెలుగుసాహిత్యంలో గుర్వాశ్రమాలు, శస్త్రాస్త్ర, వివిధశాస్త్ర బోధన, గురుశిష్య సంబంధాలు తదితర అంశాలకు సంబంధించిన వృత్తాంతాలు కోకొల్లలుగా దర్శనమిస్తాయి. విషయ విస్తృతికి వెఱచి నేను కేవలం "శ్రీమదాంధ్ర మహాభారతము"లోని గురుదక్షిణకు సంబంధించిన వృత్తాంతాలను ఈ వ్యాసంలో వివరిస్తున్నాను.

కవిత్రయభారతంలో ప్రముఖంగా గురుదక్షిణకు సంబంధించిన నాలుగు వృత్తాంతాలు కనిపిస్తాయి. అవి

1. ఉదంకుడి వృత్తాంతం
2. ఏకలవ్యుడి వృత్తాంతం
3. అర్జునుడి వృత్తాంతం
4. గాలవుడి వృత్తాంతం

ఇప్పుడు గురుదక్షిణలకు సంబంధించిన పై వృత్తాంతాలను ఒక్కొక్కటిగా తెలుసుకుందాం!

**1. ఉదంకుడి వృత్తాంతం :**

"ఉదంకోపాఖ్యానం" నన్నయచే రచింపబడిన ఆదిపర్వంలోని ప్రథమాశ్వాసంలో ఉంది. ఉదంకుడు బ్రహ్మసమానుడు, తపస్సంపన్నుడు అయిన పైలుడనే మునిశ్రేష్ఠుడి వద్ద భక్తిశ్రద్ధలతో జ్ఞానసముపార్జన చేశాడు.

కII గురుకులము నందు గురులకుఁ
బరిచర్యలొనర్చి తానపరిమిత నిష్ఠా
పరుఁడై జ్ఞానము వడసెను
గురుదయనణిమాది కాష్టగుణములతోడన్ (ఆదిపర్వము – ప్రథమాశ్వాసము)

ఈ విధంగా గురువుకు పరిచర్యలు చేసి అణిమాది అష్టసిద్ధులను కూడ సాధించాడు. గురువు కోరిక మేరకు గురుదక్షిణగా గురుపత్నికి పౌష్యమహారాజు ధర్మపత్ని కర్ణాభరణాలను తీసుకురావడానికి వెళ్ళి, పౌష్యపత్ని నుండి కర్ణాభరణాలను స్వీకరించి తిరిగివచ్చే సమయంలో మార్గమధ్యంలో వాటిని ఒక పవిత్ర ప్రదేశంలో ఉంచి ఆచమనం చేయసాగాడు. అప్పుడు తక్షకుడు దిగంబర వేషధారియై వచ్చి ఆ కర్ణాభరణాలను తస్కరించి సర్పరూపంలో నాగలోకానికి వెళ్ళగా, ఉదంకుడు సైతం నాగలోకంలోకి ప్రవేశించి, నాగులను స్తుతించి, ఇంద్రుడి మిత్రుడైన పర్జన్యుడి సహకారంతో ఇచ్చిన మాట ప్రకారం నాల్గవరోజుకంతా గురుపత్నికి ఆమె కోరిన పౌష్యపత్ని కర్ణాభరణాలను సమర్పించి తన గురుభక్తిని చాటుకున్నాడు.

తన శిష్యుడైన ఉదంకుడు ఇచ్చిన గురుదక్షిణకు ఎంతో తృప్తిచెందిన పైలముని –

కII కరమిష్టము సేసితి మా
కరిసూదన! దీన నీకు నగు సత్ఫలముల్

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed:VOLUME:9, ISSUE:6(7), JUNE :2020

**గురుకార్య నిరతులగు స**

**త్పురుషులకగుటరుదే! యధిక పుణ్యఫలంబున్** (ఆదిపర్వం – ప్రథమాశ్వాసం, 119)

గురువులను సేవించి, సంతృప్తిపరచే వారికి గొప్ప పుణ్యఫలాలు లభిస్తాయని శిష్యుడైన ఉదంకుణ్ణి ఆశీర్వదించాడు.

"గుర్వర్థేయతమానం అనుగృహ్ణం దేవతాః" అని ఆర్యోక్తి. గురుదక్షిణ కోసం శ్రమించి సాధించిన వారిని దేవతలు సైతం అనుగ్రహిస్తారని ఉదంకుని వృత్తాంతం నిరూపిస్తుంది.

**౨. ఏకలవ్యుడి వృత్తాంతం :**

ఏకలవ్యుడి వృత్తాంతం ఆదిపర్వంలోని పంచమాశ్వాసంలో మనకు దర్శనమిస్తుంది. ఏకలవ్యుడు హిరణ్యధన్వుడనే ఎరుకలరాజు కుమారుడు. హస్తినాపురంలో ద్రోణాచార్యుడు కురుపాండవులకు, ఇతర రాజ్యాల రాకుమారులకు శస్త్రాస్త్ర విద్యలలో శిక్షణనిస్తున్నాడని విని, ద్రోణుడి ధనుర్విద్యా నైపుణ్యాన్ని తెలుసుకొని తనకు కూడా ధనుర్విద్య నేర్పమని ద్రోణుని ప్రార్థించాడు.

ద్రోణుడు ఏకలవ్యుడు "నిషాదరాజు పుత్రుడు" అని అతడికి విద్య నేర్పడానికి నిరాకరించాడు. ద్రోణుని అనుమతిపొందిన ఏకలవ్యుడు ద్రోణుని మృత్తికాశిల్పాన్ని సిద్ధంచేసుకొని ప్రదక్షిణ నమస్కారాలు చేసి పట్టుదలతో విలువిద్యలోని మర్మాలన్నింటిని నేర్చుకున్నాడు.

ఒకసారి కురుపాండవ కుమారులు వేటనిమిత్తం అడవికి వచ్చినపుడు ఏకలవ్యుడు వారి వేటకుక్క నోటికి ఒక్కసారిగా ఏడుబాణాలను చాకచక్యంగా సంధించాడు. కురుమారులు అతడి నైపుణ్యానికి మెచ్చి అతడి గురువెవరని ప్రశ్నించగా, ఏకలవ్యుడు తాను ద్రోణుని శిష్యుడనని చెప్పుకున్నాడు.

అది విన్న అర్జునుడు ఈర్ష్యచెంది ఏకాంతంలో ద్రోణాచార్యునితో...

సీ॥ .............

**యన్న! ధనుర్ధరులన్యులు నీకంటె**

**నధికులు గాకుండునట్లు గాఁగఁ**

**గలవుడు విలువిద్య ఘనముగా" నని...** (ఆదిపర్వం – పంచమాశ్వాసం-230)

అన్న గురువు మాటను గుర్తుచేసి

**"... నాక కాదీ... త్రిలోకముల కధికుఁ జూచితిమి యొక యెరుకన్"** (ఆది – 5-259)

అని పలికేసరికి ద్రోణుడు అదిరిపడి అర్జునునితోకలసి ఏకలువ్యునివద్దకు వెళ్ళాడు. ద్రోణుని చూచి ఉప్పొంగిపోయిన ఏకలవ్యుడు సపర్యలు చేసి

"యేను మీ శిష్యుండ; మిమ్మారాధించి మీ ప్రసాదంబున నివ్విలు విద్యఁగఱచితి"నని కరంబులు మొగిచియున్నం జూచి, ద్రోణుం"డట్లేని మాకు గురుదక్షిణ యిమ్మ"న్నాడు. తన సర్వస్వము గురువుకు

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed:VOLUME:9, ISSUE:6(7), JUNE :2020

సమర్పిస్తానని ఆనందముతో పలికిన ఏకలవ్యుడితో ద్రోణుడు

**క॥** ' నెమ్మిని నీ దక్షిణ హ
**స్తమ్మున పెనువ్రేలు దునిమి దక్షిణయి; మ్మి**
**ష్టమ్మిది నా' కనవుడు విన**
**యమ్మున వాఁడిచ్చె దాని నాచార్యునకున్** (ఆది - 5-243) ఏకలవ్యుడు ఎటువంటి సంకోచం లేకుండా వినయంగా తన కుడిచేతి బొటన వేలును గురుదక్షిణగా సమర్పించుకున్నాడు.

ఎఱుకలవాడన్న కారణంగా విద్యనేర్పని శుష్యునినుండి, తన ప్రియశిష్యుడైన అర్జునుడికి ఇచ్చిన మాటకోసం ఏకలవ్యుని నుండి అతని విలువిద్యనే గురుదక్షిణగా తీసుకున్నాడు ద్రోణుడు. ఎఱుకలవాడైనా గుణంలో గురువుకన్నా గొప్పవాడయ్యాడు ఏకలవ్యుడు.

**3. అర్జునుడి వృత్తాంతం :**

ఆదిపర్వం - షష్ఠ్యాశ్వాసంలో అర్జునుడి గురుదక్షిణకు సంబంధించిన వృత్తాంతాలు రెండు కనిపిస్తాయి.

**అందులో మొదటిది:**

భీష్ముడు తన మనుమలైన ధార్తరాష్ట్ర పాండుకుమారులందరినీ విలువిద్య నేర్పడం కోసం ద్రోణాచార్యునికి సమర్పించాడు. ద్రోణుడు వారందరిని -

**తే॥** **"అస్త్రవిద్యలు గఱచి నాదైన యిష్ట**
**మొగిన తీర్పంగ నిందెవ్వఁ డోపు"....** (ఆదిపర్వం - 5-224)

అని అడిగాడు. శిష్యులందరూ మౌనం వహించారు. అర్జునుడు లేచి "నేను తీరుస్తాను" అని ముందుకు వచ్చాడు. పరమానందభరితుడైన ద్రోణుడు అతడిని కౌగిలించుకొని, అతణ్ణి శస్త్రాస్త్రవిద్యల్లో నిపుణున్ని చేశాడు.

కుమారాస్త్రవిద్యాప్రదర్శనం తర్వాత ద్రోణుడు కౌరవపాండవులందరిని రప్పించి "మీరు నాకు గురుదక్షిణయిండు" (ఆది-5-64) అని అన్నాడు. అప్పుడు శిష్యులందరు "మీకెద్ది యిష్టంబు సెప్పుండు (ఆది-5-64) అని అడిగారు. దానికి ద్రోణుడు "... యవివేక కారణదారణైశ్వర్యావలిప్తుండైన ద్రుపదు నొడిచిపట్టి తెండిదియ నాకిష్టంబైన గురుదక్షిణ" (ఆది - 5 - 64) అని ఆజ్ఞాపించగానే కౌరవ రాకుమారులందరూ ఆయుధాలను సమకూర్చుకుని, రథాలెక్కి దిక్కులుపిక్కటిల్లేలా గర్జిస్తూ అసంఖ్యాక సైన్యంతో పాంచాల దేశానికి వెళ్ళి ద్రుపదుని పట్టణాన్ని చుట్టుముట్టారు.

పాండుకుమారులు కూడ రథాలెక్కి, ద్రోణుని మధ్యలో ఉంచుకొని కౌరవుల వెనుకే బయలుదేరారు. ద్రుపదుని నగరాన్ని చుట్టుముట్టిన కౌరవులను చూసి కోపించిన ద్రుపదుడు తన అసంఖ్యాక సైన్యంతో కౌరవులను ఎదుర్కొన్నాడు. కౌరవులు యుద్ధం చేసి ద్రుపదుని పరాక్రమాన్ని తట్టుకోలేక పాండవుల వద్దకు పరుగెత్తారు.

అప్పుడు అర్జునుడు ద్రోణ, ధర్మరాజులతో "...మీరలిందయుండుం; దేనీక్షణంబ యప్పాంచాలుంబట్టి తెచ్చెద" అని చెప్పి భీమసేనుడు సైన్యానికి ముందు నడుస్తుండగా, అర్జునరథచక్రాలకు నకులసహదేవులు రక్షకులుగా రాగా ద్రుపదుని సేనను చేరారు.

భీముడు గజసమూహాలను ఎదుర్కొని, వాటిని పిడిగుద్దులతో బాధించి, వాటి కుంభస్థలాలను బద్దలు కొట్టి, మావటీలతోపాటు నేలపాలు చేశాడు. అదేవిధంగా ద్రుపదుని అశ్వ, రథ సమూహాలను భగ్నంచేశాడు. అర్జునుడు సైతం ద్రుపదని చతురంగబలాలను అణచివేశాడు. ద్రుపదుని తమ్ముడు సత్యజితుడనేవాడిని యుద్ధంనుంచి పారిపోయేలాచేశాడు.

తరువాత ద్రుపదుడు అమితపరాక్రమంతో అర్జునుని ఎదుర్కొన్నాడు. ఇరువురు వీరులు బాణాలు ప్రయోగించుకుంటూ భీకర, ద్వంద్వయుద్ధాన్ని సాగించారు. ద్రుపదుడు అర్జునుని ధనుస్సు మధ్యభాగం విరిగేలా బాణం వేశాడు. అర్జునుడు ఆగ్రహంతో రగిలిపోతూ కత్తిని తీసుకొని ద్రుపదుని రథం మీదకు దూకి ద్రుపదుణ్ణి పట్టుకొని –

**కం॥ ప్రక్షీణదర్పు ద్రుపదు ర**
**థాక్షముతోఁ గట్టి తెచ్చి యర్జునుఁడు క్రియా**
**దక్షుండయి గరునకు "గురు**
**దక్షిణ"గా నిచ్చి చేసెఁ దత్సమ్మదమున్** (ఆది : 6-88)

ఈ విధంగా అర్జునుడు ద్రుపదుణ్ణి రథచక్రానికి కట్టి తెచ్చి గురువైన ద్రోణాచార్యునికి అతణ్ణి "గురుదక్షిణ"గా సమర్పించి గురువు గర్వపడేలా ఆనందించేలా చేశాడు.

ద్రుపదుడు చేసిన అవమానభారంతో కృంగిన ద్రోణునికి అర్జునుడు అత్యంత విలువైన "గురుదక్షిణ"ను సమర్పించి గురువును సంతృప్తి పరిచాడు.

**రెండవ గురుదక్షిణ :**

ఆదిపర్వంలోని షష్ఠ్యాశ్వాసంలో ఈ ప్రస్తావన ఉంది. ద్రుపదుని బంధించి ద్రోణునికి గురుదక్షిణ సమర్పించిన తరువాత ద్రోణుడు అతనిని వ్యంగ్యంగా నిందించి విడిచిపెట్టాడు.

తరువాత హస్తినాపురంలో ధ్రుతరాష్ట్రుడు భీష్మ, విదురుల అనుమతితో ధర్మరాజుని యౌవరాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. తన సోదరుల సహకారంతో ధర్మజుడు ఎదిరించిన రాజులను జయిస్తూ చక్కని పాలన చేయసాగాడు.

అర్జునుడు విభిన్న ఆయుధాల ప్రయోగంలో ప్రావీణ్యాన్ని సంపాదించుకున్న పిమ్మట ద్రోణుడు అతని పరాక్రమాన్ని అభినందిస్తూ ... "మెచ్చి భారద్వాజుండు వానికి బ్రహ్మశిరంబను దివ్యబాణంబు సప్రయోగ నివర్తనంబుగా నిచ్చియిట్లనియె". (ఆది – 6 – 3)

ఈ విధంగా తన ప్రియశిష్యుడైన అర్జునికి బ్రహ్మశిర" మనే అస్త్రాన్ని ఇచ్చి, ఆ అస్త్రాన్ని మానవులమీద, అల్పులమీద ప్రయోగించరాదని చెప్పి ...

"నీవు నీ బంధుసమక్షంబున నాకు గురుదక్షిణ యిమ్మిది యెయ్యదియనిన నా యుద్ధంబు సేయునపుడు నాతోనెన్నడుఁ బ్రతియుద్ధంబు సేయకుండు; మిదియ నాకు గురుదక్షిణ" యనిన నర్జునుండు వల్లెయని యాచార్యునకు నమస్కరించి దాని కొడంబడియె" (ఆది: షష్ఠ్యాశ్వాసము - 100)

ద్రోణాచార్యుడు అర్జునుణ్ణి బంధువులందరి సమక్షంలో ఒక గురుదక్షిణ ఇమ్మని కోరాడు. అది ఏమిటంటే తాను యుద్ధం చేసేటప్పుడు "అర్జునుడు తనతో ఎదురుయుద్ధం చేయరాదన్న వాగ్దానాన్ని గురుదక్షిణ"గా ద్రోణుడు కోరాడు.

ఈ విధంగా అర్జునుడు తన సోదరుల సహకారంతో ఒకసారి, వ్యక్తిగతంగా మరొకసారి ద్రోణాచార్యునికి **"రెండుసార్లు గురుదక్షిణ"** సమర్పించుకున్నాడు.

**4. గాలవుడి వృత్తాంతం:**

ఈ గాలవుడి గురుదక్షిణకు సంబంధించిన వృత్తాంతం ఉద్యోగపర్వంలో మూడవ ఆశ్వాసంలో నారదుడు సుయోధనుకి చెప్పిన సందర్భంలో వివరింపబడింది.

**ఆ॥ ఇదియనికాని చేయనెద్దియేననుచు**
**నిర్బంధవృత్తిఁ దలఁపు వట్టికొనిన**
**నట్టివాని కెందు నలజటి వాటిల్లు**
**గాలవుండు గుఱియ కాఁడె మనకు?....** (ఉద్యోగపర్వం - 3-305)

'నేను ఇలాగే చేస్తాను' అంటూ మొండిపట్టు పట్టేవాడికి ఆపదలు ఏ విధంగా కలుగుతాయో చెబుతూ గాలవుడి వృత్తాంతాన్ని నారదుడు దుర్యోధనునికి వివరించాడు.

గాలవుడనే మునికుమారుడు విశ్వామిత్రునివద్ద విద్యాభ్యాసంచేసి "గురుదక్షిణ యేమి సమర్పింతు"నని యడిగిన, నతం 'డేమియునేల' యని యుడిపిన నన్నింటికి నన్నిసెప్పి నిర్బంధించినఁ, గటకటంబడి యుత్తమోధనసద్యం 'దక్లేని శుద్ధధవళవర్ణంబులై యొక్క కర్ణంబు నీలంబైన యుత్తమాశ్వంబు లెనమన్నూఱు దెచ్చియిమ్మ'ని పలికినంబోయి" (ఉద్యోగపర్వం - 3-306).

విశ్వామిత్రుడు తనకు గురుదక్షిణ ఏమీ వద్దని చెప్పినప్పటికీ వినకుండా గాలవుడు పట్టుపట్టడంతో విసిగిపోయిన విశ్వామిత్రుడు శరీరమంతా తెల్లగా, ఒక్క చెవిమాత్రం నల్లగా వున్న ఉత్తమజాతికి చెందిన ఎనిమిది వందల అశ్వాలను గురుదక్షిణగా సమర్పించమన్నాడు.

గాలవుడు అటువంటి గుఱ్ఱాలకోసం వెదకనిచోటు లేదు. చివరకు విచారంతో నిద్రాహారాలుమాని ప్రాణత్యాగానికి సిద్ధపడి, తన బాల్య స్నేహితుడైన గరుత్మంతునిచేత రక్షింపబడి, గరుడుడి సహకారంతో, ప్రతిష్ఠాన పురాధీశుడైన యయాతి కుమార్తె మాధవి చేయూతతో ఆరువందల గుర్రాలను విశ్వామిత్రుడికిచ్చి, మాధవిని సైతం పుత్రసంతానార్థం విశ్వామిత్రుడికి సమర్పించుకున్నాడు. ఈ విధంగా గాలవుడు తన మొండితనంతో ఇవ్వలేని గురుదక్షిణ కోరబడి అష్టకష్టాలు పడ్డాడు.

ఈ విధంగా మహాభారతంలో పైలుడి శిష్యుడు ఉదంకుడు, ద్రోణుని శిష్యులైన పాండవులు, వ్యక్తిగతంగా అర్జునుడు; ద్రోణుడి పరోక్షశిష్యుడైన ఏకలవ్యుడు, విశ్వామిత్రుని శిష్యుడైన గాలవుడు తమకు ఎదురైన సమస్యలను అధిగమించి గురుదక్షిణను సమర్పించి గురువులను సంతృప్తుల్నిచేసి ధన్యులయ్యారు.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమదాంధ్ర మహాభారతము – నన్నయభట్టారకుడు, ఆదిపర్వం మొదటి భాగము – తి.తి.దే. ప్రచురణ, 2006.
2. శ్రీమదాంధ్ర మహాభారతము – నన్నయభట్టారకుడు, ఆదిపర్వం రెండవ భాగము – తి.తి.దే. ప్రచురణ, 2006.
3. శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కనసోమయాజి, ఉద్యోగ పర్వము – తి.తి.దే. ప్రచురణ, 2006.
4. పూర్వగాథాలహరి – డా॥ డి. చంద్రశేఖర రెడ్డి, భాగము – ఎమెస్కో ప్రచురణ, అక్టోబర్ 2015.